

ఒక్కేసి పువ్వేసి చందమామ

బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం హుస్నాబాద్ పట్టణంలో మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో సభ్యులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల బతుకమ్మ ఆడారు. సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చైర్‌పర్సన్ కడవేర్గు మంజులరాజనర్సు సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడారు.

- సిద్దిపేట కల్చరల్/హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి)

గాంధీభవన్‌లో బతుకమ్మ సంబరాల్లో

పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాంధీభవన్ వద్ద గురువారం మహిళా కాంగ్రెస్ ఆధ్వరంలో జరిగిన బతుకమ్మ సంబరాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. మహిళా కాంగ్రెస్ ప్రతినిధులతో కలిసి ఆమె బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ తీరొక్క పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే ఉన్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పండుగకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో మహిళలందరు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని నిర్మలా జగ్గారెడ్డి ఆకాంక్షించారు.



గాంధీభవన్ వద్ద బతుకమ్మ ఆడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



గాంధీభవన్ వద్ద మహిళా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

గ్రూప్-1లో మనోళ్ల సత్తా

సవాళ్లను అధిగమించి విజయతీరాలకు చేరిన అభ్యర్థులు

సిద్దిపేట యువకులు అఖిల్‌రెడ్డికి 75, అరుణ్‌చంద్ర 147వ ర్యాంకు

డీఎస్పీగా గంగాపూర్‌కు చెందిన నరిగే స్వామియాదవ్

ఎస్ఐ నుంచి డీఎస్పీగా పూల్‌నాయక్ తండాకు చెందిన శ్రీకాంత్ 7

చిమ్మచీకట్లో ఆర్టీసీ బస్టాండ్ 8

చేర్యాలలో ప్రయాణికుల ఇబ్బందులు

ఐఐటీహెచ్‌లో భవిష్యత్‌తరం చిప్‌ల డిజైన్ 7

75కుపైగా సెమీకండక్టర్ల అభివృద్ధి

మొబైల్ నావిగేషన్, డ్రోన్లు, రక్షణ వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచేలా రూపకల్పన

ఈ ఏడాది రైతులను కష్టాలు చుట్టుముడుతున్నాయి. పంటల సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక ఆందోళన చెందగా, ఇప్పుడు ఎడతెరిపి లేకుండా కురుస్తూ కంటిమీదకునుకు లేకుండా చేస్తున్నాయి. మధ్యలో యూరియా కొరత ఇబ్బందులను సృష్టించింది. తాజాగా మళ్లీ వరుణుడి విజృంభణతో చేతికి వచ్చిన పంటలు నీట మునిగి కుళ్లిపోతున్నాయి. పత్తి ఎర్రబారుతున్నది. మొక్కజొన్న చేలల్లోనే మొలకలు వస్తోంది. ఏం చేయాలో అర్థం కాక, రైతులు దిగులు చెందుతున్నారు.



ప్రజ్ఞాపూర్‌లో నీటిలో మునిగి ఎర్రబారిన పత్తిపంట

రైతుల్లో గుబులు

సీజన్ మొదట్లో అనావృష్టి.. ప్రస్తుతం అతివృష్టి

వరుస వర్షాలతో చేలల్లో నిలుస్తున్న నీరు

కుళ్లుతున్న పత్తి.. మొక్కజొన్నకు మొలకలు

దిగుబడులు భారీగా తగ్గుతాయని ఆవేదన



గజ్వేల్‌లో చేనులోనే ఎండిపోయి పడిపోతున్న మొక్కజొన్న

గజ్వేల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా ఈసారి వర్షాలు కురుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. వాతావరణ శాఖ మరో కొన్ని రోజులు వర్షాలు ఉంటాయని అంచనా వేయడంతో రైతుల ఆందోళన మరింత పెరిగింది. అకాల వర్షాల వల్ల పంటల్లో వేరుకుళ్లు తెగుళ్లు కూడా వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 40 వేల ఎకరాలకుపైగా పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి.

పత్తి, మొక్కజొన్నకు తీవ్ర నష్టం

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వరి అత్యధికంగా 3.40 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 28 వేల ఎకరాల్లో, పత్తి లక్షా 10 వేల ఎకరాల్లో సాగు చేశారు. అపరాలు, ఇతర పంటలు మరో 22 వేల ఎకరాల్లో సాగయ్యాయి. వరి చాలా చోట్ల నీటిలో మునిగిపోగా, కొన్నిచోట ఆశాజనకంగానే కనిపిస్తుంది. కానీ ఇంకా యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. పత్తి పంట ప్రస్తుతం కాత దశలో ఉండగా, వర్షాలకు

మిగతా 8వ పేజీలో

వదలని వాన.. కమ్మేసిన ముసురు

హుస్నాబాద్‌లో గరిష్ఠంగా 26 మి.మీ... నేడు భారీ వర్షాలు 8

మద్యంషాపులకు నోటిఫికేషన్

- అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 93 వైన్సులు.. గౌడలకు 16, ఎస్సీలకు 9 వైన్స్‌లు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల కాలానికి (2025-27) మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 93 వైన్స్‌లు ఉన్నాయి. మద్యం షాపుల కేటాయింపుల్లో భాగంగా గురువారం కలెక్టర్ హైమావతి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ల సమక్షంలో ఎస్సీ గౌడ కులస్థులకు షాపుల రిజర్వేషన్‌కు డ్రా తీశారు. వీటిలో 16 వైన్సులు గౌడ కమ్యూనిటీకి, 9 వైన్సులు ఎస్సీ కమ్యూనిటీకి కేటాయించారు. గౌడలకు షాపు నంబర్ 21, 29, 31, 36, 75, 42, 49, 47, 54, 27, 56, 48, 68, 19, 80, 85, ఎస్సీలకు షాపు నంబర్ 32, 16, 81, 24, 08, 70, 14, 35, 89 లను డ్రా ద్వారా కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌మూర్తి మాట్లాడుతూ నేటి నుంచి అక్టోబర్ 18 వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రంగధాంపల్లి వద్ద ఉన్న ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 23వ తేదీన మద్యం దుకాణాల కేటాయింపు డ్రాను కలెక్టర్ సమక్షంలో తీయనున్నట్లు తెలిపారు. గతేడాది 63 వైన్స్‌లకు 4,166 దరఖాస్తులకు రాగా, రూ.83.32 కోట్లు ఆదాయం వచ్చింది. ఈసారి ప్రభుత్వం దరఖాస్తు ఫీజు మరో రూ.లక్ష పెంచి రూ.మూడు లక్షలు చేసింది. దీంతో ఆదాయం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నది.



మద్యం షాపుల రిజర్వేషన్ డ్రాను తీస్తున్న కలెక్టర్ హైమావతి

ఊపిరి తీసిన భూమి తాకట్టు

- రూ.లక్ష అప్పుకు రుణదాతకు ఎకరం భూమి రిజిస్ట్రేషన్
- రుణం తీర్చేస్తానన్నా భూమి తిరిగి ఇవ్వడానికి నిరాకరణ
- మనోవేదనతో రైతు మృతి



పి.చంద్రం(ఫైల్)

చేర్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రూ.లక్ష అప్పు కోసం తన జీవనాధారమైన భూమిని రుణదాత పేరిట రిజిస్ట్రేషన్ చేయడం ఓ రైతు ప్రాణాన్ని బలిగొంది. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన ఈ ఘటనలో పోలోజు చంద్రం(42) అనే రైతు తన భూమిని పోగొట్టుకున్నాననే మనోవేదనతో మరణించాడు. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. పోతిరెడ్డిపల్లికి చెందిన పోలోజు చంద్రంకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం చేసుకుని జీవించే చంద్రం.. తన కుటుంబ అవసరాల కోసం అదే గ్రామానికి చెందిన కత్తుల భాస్కర్‌రెడ్డి వద్ద ఏడేళ్ల క్రితం రూ.లక్ష అప్పు చేశాడు. ఆ రుణానికి తాకట్టుగా ఎకరం భూమిని ఒప్పందం ప్రకారం భాస్కర్‌రెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. ప్రస్తుత ఆ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.30 లక్షలు దాకా ఉంది. అయితే, అప్పుగా తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లిస్తానని, తన భూమిని తిరిగి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని చంద్రం కొద్ది రోజుల క్రితం భాస్కర్‌రెడ్డిని సంప్రదించాడు. ఇందుకు నిరాకరించగా, చంద్రం విషయాన్ని పెద్దమనుషుల దృష్టికి తీసుకెళ్లాడు. భాస్కర్‌రెడ్డికి అసలు, వడ్డీ కింద రూ.7 లక్షలు చెల్లించాలని తీర్మానించగా.. అంగీకరించిన చంద్రం భయానాగా రూ.50వేలు చెల్లించాడు. ఆ డబ్బును వెనక్కి ఇచ్చేసిన భాస్కర్‌రెడ్డి.. ఆ భూమిలో వ్యవసాయ పనులు చేయకుండా చంద్రంను ఇటీవల అడ్డుకున్నాడు. చంద్రం విషయాన్ని మళ్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా, పోలీసుల వరకు విషయం వెళ్లినా సమస్య కొలిక్కిరాలేదు. ఈ క్రమంలో భూమి పోయిందని మనోవేదనకు గురైన చంద్రం బుధవారం రాత్రి హఠాత్తుగా ప్రాణం విడిచాడు. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబసభ్యులు గురువారం ఉదయం మృతదేహాన్ని భాస్కర్‌రెడ్డి ఇంటి వద్దకు తీసుకెళ్లి ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకోగా.. భాస్కర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని పట్టుబట్టారు. చంద్రం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కత్తుల భాస్కర్‌రెడ్డి పరారీలో ఉన్నాడు.

వసతుల కల్పన బాధ్యత మాది.. చదివే బాధ్యత మీది

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్/అక్కన్నపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ శాతవాహన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో మౌలిక వసతులను కల్పించే బాధ్యత తమదని, బాగా చదువుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్టూడెంట్స్‌కు సూచించారు. హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు గురువారం యూనిఫాం చీరలను పంపిణీ చేశారు. అలాగే, హుస్నాబాద్ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో రవాణా శాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా పుస్తకాలు, క్యాలిక్‌లెటర్లు, ఇతర కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంతి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేకంగా స్పాట్ అడ్మిషన్లకి అవకాశం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్‌కుమార్, ఆర్డీవో రామ్మూర్తి, ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, రవాణా శాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

అక్కన్నపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలో రూ.1.50 కోట్లతో మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం ప్రభుత్వ కార్యాలయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకే మొదటగా ఎంపీడీవో కార్యాలయ భవనానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయిందని, కాలువల నిర్మాణం త్వరగా పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి





కాత్యాయనీదేవిగా విద్యాసరస్వతీ అమ్మవారు, అన్నపూర్ణదేవిగా విజయదుర్గామాత

వైభవంగా నవరాత్రులు

వర్గల్/కొండపాక, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాల్గో రోజైన గురువారం వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారు. శ్రీకాత్యాయనీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మింపజేసే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కొండపాక మండలం మర్పడగలోని మల్లికార్జునస్వామి క్షేత్రంలో విజయదుర్గామాతను అన్నపూర్ణదేవిగా అలంకరించారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రఘునందన్



గిరి ప్రదక్షిణం.. భక్తిపారవశ్యం

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో గురువారం స్వాతి నక్షత్రం, స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా తోగుట రాంపురం పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతీ స్వామిజీ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా నేతృత్వంలో, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామరాజు పర్యవేక్షణలో కొనసాగగా, వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవానంద స్వామి అనుగ్రహభాషణం చేశారు.

- వర్గల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి)



పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా...?

మీ కుటుంబ సభ్యులలో మీ బంధుమిత్రులలో మీ సహోద్యోగులలో ఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా..? అయితే వారికి, తీపి గుర్తుగా ఆంధ్రజ్యోతి ద్వారా అందించండి ఆత్మీయ శుభాకాంక్షలు



ఆంధ్రజ్యోతి

అందిస్తోంది సులువైన మార్గం ఉద్యోగవిరమణ ప్రకటనలకు

25% సిటీ /జిల్లా ప్రకటనకు డిస్కౌంట్

15% జోన్ ప్రకటనకు డిస్కౌంట్

ప్రతి ప్రకటనపై GST 5% వర్తిస్తుంది.

సంగారెడ్డి / పటాన్‌చెరు	:99516 09964
నారాయణఖేడ్ / జహీరాబాద్	:97030 18478
మెదక్ /నర్సాపూర్	:97030 18476
సిద్దిపేట /గజ్వేల్	:99485 05054



ప్రజల కోసమే జీఎస్టీ సంస్కరణలు

● ఎమ్మెల్సీ అంజిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలు ప్రజల ప్రయోజనాల కోసమేనని, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్ అధ్యక్షతను ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలను కాంగ్రెస్ పార్టీ తట్టుకోలేకపోతుందన్నారు. అంతకుముందు జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు, పార్టీ సిద్ధాంతకర్తల్లో ఒకరైన పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రంజిత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్ రాజేందర్, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, నాయకులు ఎంఎల్ఎన్‌రెడ్డి, విజయ్ తదితరులున్నారు.









పంట రాకముందే..

కల్హేర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో, రైళ్లలో సీటు కోసం ముందస్తుగానే దస్తీ వేయడం తెలిసిందే. ఇక్కడ రైతులు కూడా రోడ్డుపై చెట్ల కొమ్మలు వేసి స్థలాన్ని రిజర్వ్ చేసుకుంటున్నారు. తీరా పంట చేతికి వచ్చిన తర్వాత ఆరబెట్టుకోవడానికి స్థలం దొరకక ఇబ్బంది పడాల్సి వస్తుందనే ఉద్దేశంతో ఇలా చెట్ల కొమ్మలు వేశారు. కల్హేర్ నుంచి ఇందిరానగర్ వెళ్లే రోడ్డులో సుమారు కిలోమీటరు పొడవున పలువురు రైతులు ఇలా కొమ్మలు వేయడం కనిపించింది. ఇదేమిటని రైతులను ప్రశ్నిస్తే ధాన్యం రావడానికి సమయం ఉన్నా.. తీరా వచ్చిన తర్వాత ఆరబెట్టుకోవడానికి స్థలం దొరకకపోతే ఇబ్బంది పడుతామని, అందుకే ఇలా రిజర్వ్ చేసుకుంటున్నామని చెప్పారు. అయితే, రోడ్లపై ధాన్యం, ఇతర పంటోత్పత్తులు ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

భూభారతి ఆర్జీలను త్వరతగతిన పరిష్కరించండి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు.25 (ఆంధ్రజ్యోతి): భూభారతి పెండింగ్ ఆర్జీలను త్వరతగతిన పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఆర్డీవో, తహసీల్దార్లతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు అవసరమైన పూర్తి వివరాలను జత చేసి తహసీల్దార్ కార్యాలయంలో నుంచి ఆర్డీవో కార్యాలయానికి అటు నుంచి కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. నిర్ణీత గడువులోగా అన్ని దరఖాస్తులను పరిష్కరించేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరిస్తే అందుకు గల కారాణాలను స్పష్టంగా తెలపాలని సూచించారు. సాదా బైనామా పీవోటీలకు సంబంధిందచిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో వెళ్లి సంబంధిత స్థలాలను పరిశీలన చేసి విచారణ జరపాలని పేర్కొన్నారు. రానున్న 15 రోజుల్లో భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి సమస్య పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి, జహీరాబాద్ ఆర్డీవో దేవూజా, సంగారెడ్డి, అందోల్ ఆర్డీవోలు రాజేందర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

● ప్రభుత్వ ఉపాధ్యాయుడి బైక్ యాత్ర

చేర్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిసగా మారి ఉజ్వల జీవితాన్ని చిత్తు చేసుకోకూడదని సూచిస్తూ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వినూత్న తీరులో అవగాహన కల్పిస్తున్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రభాకర్ ద్విచక్రవాహనంపై రాష్ట్రవ్యాప్త జనచైతన్య యాత్ర నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో గురువారం సాయంత్రం చేర్యాల పట్టణానికి చేరుకోగా, అంగడిబజారు చౌరస్తా వద్ద యువతనుద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. దసరా సెలవులను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపట్టనున్నానని, యువకులను చైతన్యవంతం చేసి మాదకద్రవ్యాల నిర్మూలనకు తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈమేరకు పలువురు ఆయనను అభినందించారు.


ద్విచక్రవాహన యాత్ర చేర్యాలకు చేరుకున్న ప్రభాకర్



పరిశ్రమ మిషన్‌లో ఇరుక్కొని కార్మికుడి మృతి


అభిషేక్ మృతదేహం

గుమ్మడిదల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం మంబాపూర్ శివారులోని ఎస్‌పీఎస్ పరిశ్రమలో ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మిషన్‌లో ఇరుక్కొని మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంబాపూర్ శివారులోని ఎస్‌పీఎస్ పరిశ్రమలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్(22) కార్మికుడిగా పని చేస్తున్నారు. బుధవారం ఓ మిషన్ వద్ద పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కొని.. ఊపిరాడక మృతి చెందాడు. పరిశ్రమలో కార్మికులకు ఎలాంటి భద్రత చర్యలు లేకపోవడం వల్లే అభిషేక్ మృతి చెందినట్లు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. అభిషేక్ సోదరుడు అనికేత్ వర్మ ఫిర్యాదు మేరకు పరిశ్రమ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని ఆశ్రయించారు. దీంతో ఆయన పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా అసంఘటిత రంగ కార్మికుడికి విధులు అప్పగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చల అనంతరం పరిశ్రమ యాజమాన్యం బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం, అంత్యక్రియలకు రూ. లక్ష అందించేందుకు అంగీకరించింది. ఈ మేరకు గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో పరిశ్రమ ప్రతినిధులు, ఉత్తరాది సంక్షేమ సంఘం సభ్యుల సమక్షంలో మృతుని కుటుంబీకులకు పరిహారం చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజయ్ సింగ్, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..


విజయ్‌కుమార్ మృతదేహం

రామచంద్రాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన కొల్లూరు ఓఆర్ఆర్‌పై గురువారం చోటుచేసుకుంది. కొల్లూరు సీఐ గణేశ్ పటేల్ కథనం ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని నాంపల్లికి చెందిన విజయ్‌కుమార్ (37) నలుగురు స్నేహితులతో కలిసి గురువారం కారులో తుల్జాపూర్ బయలుదేరారు. కొల్లూరు ఓఆర్ఆర్ జంక్షన్‌కు చేరుకునే సరికి కారు టైరు పంక్చర్ అయింది. దీంతో విజయ్‌కుమార్ మరో మిత్రుడు రాచప్ప(23) కారు వద్ద ఉండగా రమేష్(30), నందు(22), జగదీశ్వర్(32)లు టైరు పంక్చర్ వేయించడానికి ఓఆర్ఆర్ కిందకు దిగారు. కారు వద్ద ఉన్న విజయ్‌కుమార్, రాచప్పలు కారు బయట నిలుచుని ఉండగా వేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని లారీ వారిని ఢీ కొని అలాగే ముందుకు వెళ్లింది. ఈ ఘటనలో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, రాచప్పకు తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు ఎస్సై రమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పారా మెడికల్ విద్యార్థి ఆత్మహత్య


అనిల్‌కుమార్ మృతదేహం

హయత్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట్ మండలం చిల్లపల్లి గ్రామానికి చెందిన రాయిని అనిల్‌కుమార్ (21) సామనగర్ రోడ్డు నంబర్ 10లో ఉన్న బీసీ వెల్ఫేర్ హస్టల్‌లో ఉంటూ హయత్‌నగర్‌లోని డీఎంఐటీ విజయ రీసెర్చ్ ఆఫ్ పారా మెడికల్ లేబరేటర్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం హస్టల్‌లో ఎవరు లేని సమయంలో అనిల్‌కుమార్ ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. అనిల్‌కుమార్ ఎంతకు తలుపు తీయక పోవడంతో అనుమానం వచ్చిన తోటి విద్యార్థులు తలుపులు ధ్వంసం చేసి లోనికి వెళ్లగా అనిల్‌కుమార్ వేలాడుతూ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే చికిత్స ఓ ఆసుపత్రికి తరలించగా మృతిచెందిన వైద్యులు నిర్ధారించారు. అనిల్‌కుమార్ ప్రేమవ్యవహారంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తోటలపై దాడులు


గంజాయి మొక్కలు తొలగిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మనూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా సాగు చేస్తున్న గంజాయి తోటలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి 155 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన దుద్దగొండ నారాయణ తన వ్యవసాయ భూమిలో పత్తి పంట మధ్యలో గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహిచి మొక్కలను ధ్వంసం చేశారు. ఈ 155 మొక్కల విలువ సుమారు రూ.15లక్షల వరకు ఉంటుందని ఎక్సైజ్ సీఐ శంకర్ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సై హన్మంతుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



హవేళిఘణపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని పోచారం డ్యాం, పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులుగా 24 గంటలు ప్రజల రక్షణకు సేవ చేస్తున్నామని, పోలీసు సిబ్బంది ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల రక్షణకు బాంబ్ స్క్వాడ్, నార్కోటిక్ డాగ్స్‌లతో బస్టాండ్లు, దాబాలు, హోటళ్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్పీ పర్యటన అనంతరం పోలీసులు మండల కేంద్రంలోని హోటళ్లు, దాబాలు, కిరాణా షాపుల్లో బాంబ్ స్క్వాడ్, నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేశారు. ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి.

అమ్మాయిల జోలికి వెళ్తే పోక్సో కేసులు

● మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్

పాపన్నపేట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిల జోలికి వెళ్తే పోక్సో కేసులు నమోదు చేస్తామని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ హెచ్చరించారు. మెదక్, అల్లాదుర్గం సర్కిల్ పరిధిలోని పోలీసులతో గురువారం మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో కమ్యూనిటీ కనెక్టివిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాయుధ పోలీసుల కవాతు నిర్వహించారు. అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. పలు అనుమానిత వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామ కూడలి వద్ద జరిగిన ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్,టౌన్ సీఐ మహేశ్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సరైన పత్రాలు లేని 65 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

గ్రూప్-1లో మనోళ్ల సత్తా

సవాళ్లను అధిగమించి విజయతీరాలకు చేరిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా అభ్యర్థులు సత్తా చాటారు. అనేకమంది తమ పట్టుదల, కృషి, అకుంఠిత దీక్షతో ఉన్నత స్థానాలను సాధించారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే, మరికొందరు ఎలాంటి కోచింగ్ లేకుండానే, తమ తొలి ప్రయత్నంలోనే గొప్ప విజయం సాధించి స్ఫూర్తిగా నిలిచారు. ఈ విజేతల్లో కొందరు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నా.. ఉన్నత స్థానాల కోసం అహర్నిశలు శ్రమించి విజయతీరాలకు చేరుకున్నారు. విజయాలు వారి వ్యక్తిగత సామర్థ్యాన్ని, అంకితభావాన్ని చాటి చెప్పడమే కాకుండా, సరైన ప్రణాళికతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని నిరూపించాయి.

17 ర్యాంక్ సాధించిన ప్రణయ్ సాయి

తూప్రాన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో తూప్రాన్‌కు చెందిన బోయిని పల్లి ప్రణయ్ సాయి డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు. టీజీపీఎస్సీ ప్రకటించిన 115 డీఎస్పీ పోస్టుల్లో ఆయన మొదటి స్థానంలో నిలిచారు. గతంలో విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో 513 మార్కులతో రాష్ట్రస్థాయిలో 17వ ర్యాంకు సాధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోయిన్ పల్లి విష్ణువర్ధన్, శ్రీవిద్య దంపతుల కుమారుడైన ప్రణయ్ సాయి ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. గతంలో గ్రూప్-4 లోనూ సత్తా చాటి జూనియర్ అసిస్టెంట్‌గా చెగుంట తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్-2లో 134వ ర్యాంకు, గ్రూప్-3లో 148వ ర్యాంకు సాధించారు. తన లక్ష్యం సివిల్స్ సాధించడమేనని ప్రణయ్ సాయి తెలిపారు.



తండ్రి విష్ణుతో ప్రణయ్‌సాయి

ఎలాంటి కోచింగ్ లేకుండానే..



తల్లిదండ్రులతో పూన శైలేష్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ర్యాంకుల్లో మెదక్ పట్టణానికి చెందిన పూన శైలేష్ సత్తా చాటి తండ్రి కల నేర వేర్చాడు. ఎలాంటి కోచింగ్ లేకుండానే తొలి ప్రయత్నంలోనే 41వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రోజుకు 10-12 గంటలు చదివి పట్టుదలతో తన ప్రతిభను చాటినట్లు తెలిపాడు. మెదక్ పట్టణానికి చెందిన పూన రవి, ఝాన్సీ దంపతుల పెద్ద కుమారుడు ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాడు. ఎంఏ చేస్తూ.. ఎవరి దగ్గర శిక్షణ తీసుకోకుండానే ఈ ఘనత సాధించారు. శైలేష్‌కు బంధువులు, పట్టణ వాసులు శుభాకాంక్షలు తెలిపారు.

పట్టుదలతో చదివి..



ప్రభాత్‌రెడ్డి

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం మూసాపేట గ్రామానికి చెందిన ఎరగారి ప్రభాత్ రెడ్డి గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికయ్యారు. గతంలో నిర్వహించిన పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 73వ ర్యాంకు సాధించారు. ప్రభాత్‌రెడ్డి తండ్రి శశీరంధర్‌రెడ్డి పీఏసీఎస్ డైరెక్టర్. ప్రభాత్‌రెడ్డి చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండి పదవ తరగతిలో 9.8 జీపీఏ సాధించారు. బీటెక్‌లో సీజీపీఏ 9.0తో ఉత్తీర్ణత పొందారు. గ్రూప్-4లో సత్తా చాటిన ప్రభాత్‌రెడ్డి ప్రస్తుతం రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన కృషి, పట్టుదలతో గ్రూప్-1లో విజయం సాధించారని ఆయన తెలిపారు.

సిద్దిపేట యువకుల సత్తా..



అఖిల్ రెడ్డి ,అరుణ్ చంద్ర

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ 1 ఫలితాల్లో సిద్దిపేటకు చెందిన యువకులు సత్తా చాటారు. పట్టణంలోని ప్రియదర్శిని నగర్‌కు చెందిన నర్రా భగవాన్ రెడ్డి, వజ్రమ్మ దంపతులు కుమారుడు నర్రా అఖిల్ రెడ్డి 75వ ర్యాంకు సాధించాడు. ఇంటర్మీడియట్ వరకు సిద్దిపేటలో చదివిన అఖిల్, బీటెక్, ఎంటెక్ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. ఇంతకుముందు సివిల్స్ రాసి రెండు సార్లు మెయిన్స్ వరకు వెళ్లాడు. ఆ తర్వాత ఇంజనీరింగ్ టెక్నికల్ ఎగ్జామ్స్ క్లియర్ చేసి ప్రస్తుతం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అలాగే సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వీవీ రావు-జయశ్రీ దంపతుల కుమారుడు అరుణ్‌చంద్ర 147 ర్యాంకు సాధించాడు. వరంగల్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన అరుణ్ చంద్ర రెండుసార్లు సివిల్స్ మెయిన్స్ వరకు వెళ్లాడు. ప్రస్తుతం గ్రూప్-1లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్టుకు ఎంపికయ్యారు.

డీఎస్పీగా గంగాపూర్ యువకుడు



చిన్నకోడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన నరిగే స్వామి యాదవ్ గ్రూప్-1 లో సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో 95వ ర్యాంకు సాధించి డీఎస్పీ (సివిల్) ఉద్యోగానికి ఎంపికయ్యారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన చంద్రయ్య, కనకవ్వ దంపతుల కుమారుడైన స్వామి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారు. బాసర ఐఐఐటీలో చదివి, ఆ తర్వాత ప్రైవేటు ఉద్యోగం చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమై 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించి, ఆ తర్వాత రాజీనామా చేశారు. ఇటీవల గ్రూప్-2లో 116వ ర్యాంకు, గ్రూప్-3లో 52వ ర్యాంకు సాధించారు. ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని స్వామి తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి నుంచి డీఎస్పీ వరకు..



స్వామి

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్‌తండాకు చెందిన లావుడ్య శ్రీకాంత్ నిరూపించారు. టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో ఆయన డీఎస్పీగా ఎంపికయ్యారు. లావుడ్య సోమ్లా, లక్ష్మి దంపతుల కుమారుడైన శ్రీకాంత్ చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తి కనబర్చాడు. 2018 లో పంచాయతీ కార్యదర్శిగా, రెండు నెలల తర్వాత వీఆర్వోగా ఉద్యోగాలు సాధించారు. అయినా సంతృప్తి చెందక ఎస్సై కావాలనే లక్ష్యంతో కృషి చేశారు. ఎస్సై పరీక్షల్లో మంచి మార్కులు సాధించి మొదట చందుర్తిలో ఎస్సైగా పనిచేశారు. జోనల్ వ్యవస్థ మార్పులో భాగంగా ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సైగా పనిచేస్తూనే గ్రూప్-1 పరీక్షలు రాసి 900 మార్కులకు 489 మార్కులు సాధించి 89వ ర్యాంకు పొందారు. తాజాగా విడుదలైన జాబితాలో ఆయనకు డీఎస్పీ పోస్టు లభించింది. శ్రీకాంత్ విజయంపై ఆయన కుటుంబ సభ్యులు, తండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

స్వీపర్ కుమారుడికి ఎంపీడీవో ఉద్యోగం



ఉల్లెంగుల శ్రీధర్

అక్కన్నపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పార్ట్‌టైమ్ స్వీపర్ కుటుంబం నుంచి ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలను సాకారం చేశారు. అక్కన్నపేట మండలం కట్కూర్‌కు చెందిన ఉల్లెంగుల హన్మయ్య, మల్లవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హన్మయ్య పార్ట్ టైమ్ స్వీపర్‌గా పనిచేస్తూ నలుగురు పిల్లలను చదివించారు. పెద్ద కుమార్తె స్వప్న శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్‌గా, రెండో కుమార్తె హారిక హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. పెద్ద కుమారుడు శ్రీధర్ గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్‌గా హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్నారు. గ్రూప్-3లో 1644వ ర్యాంక్ సాధించిన అతడు తాజాగా గ్రూప్-1లో 864వ ర్యాంకు సాధించి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. తండ్రి కష్టానికి ఫలితం దక్కినందుకు సంతోషంగా ఉందని శ్రీధర్ తెలిపారు. హన్మయ్య చిన్న కుమారుడు ఉల్లెంగల శ్రీకాంత్ ఎంబీఏ పూర్తి చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. తండ్రి పార్ట్‌టైం స్వీపర్‌గా పనిచేసి నానా కష్టాలు పడి నలుగురు పిల్లలను చదివించాడు. పిల్లలు ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీడీఓగా బానోతు ప్రవీణ్



భానోత్ ప్రవీణ్

కోహెడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బానోతు ప్రవీణ్ గ్రూప్-1 ఫలితాల్లో ఎంపీడీవోగా ఎంపికయ్యారు. బుధవారం రాత్రి వెలువడిన ఫలితాల్లో ప్రవీణ్‌కు 452 మార్కులు వచ్చాయి. వ్యవసాయ కుటుంబానికి చెందిన మంతు-లక్ష్మి దంపతుల కుమారుడైన ప్రవీణ్ అస్సాంలోని గౌహతిలో ఐఐటీ పూర్తి చేశారు. సివిల్స్ కోసం సిద్ధమవుతూనే గ్రూప్-1 పరీక్ష రాసి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని తెలిపారు.

దుబ్బాకవాసి..



వెంకటేష్

దుబ్బాక, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల్లో దుబ్బాకకు చెందిన బైండ్ల వెంకటేష్ సత్తా చాటారు. మొదటి ప్రయత్నంలోనే 453 మార్కులతో రాష్ట్రస్థాయిలో 543వ ర్యాంకు సాధించి మల్టీ జోన్-2లో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పోస్టుకు ఎంపికయ్యారు. వెంకటేష్ తండ్రి బైండ్ల నారాయణ సంగారెడ్డి శివారులోని ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ రిటైర్డ్ ఉద్యోగి కాగా, తల్లి రేణుక గృహిణి. వెంకటేష్ చదువంతా సంగారెడ్డి, హైదరాబాద్‌లోనే కొనసాగింది. అతడి తండ్రి ఉద్యోగ విరమణ తరువాత తన సొంత గ్రామం దుబ్బాకలోనే నివాసముంటున్నారు. తల్లిదండ్రుల కష్టం గుర్తించిన వెంకటేష్ సివిల్స్(ఐపీఎస్) సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. గతంలో నాలుగు సార్లు సివిల్స్ పరీక్షలు రాసినప్పటికీ క్వాలిఫై కాలేదు. దీంతో గ్రూప్-1పై దృష్టి పెట్టారు. ఎలాంటి కోచింగ్ లేకుండా రోజుకు 10 గంటల పాటు కష్టపడి ఈ విజయం సాధించానని వెంకటేష్ తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో గ్రూప్ 4 సాధించి సంగారెడ్డి కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు అనంతరం మార్చిలో విడుదలైన జేఎల్‌ఫలితాల్లో సత్తా చాటిన అతడు ప్రస్తుతం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఎలాగైనా సివిల్స్ సాధించి దుబ్బాక పేరు నిలబెడతానని ఆయన తెలిపారు.

సచిన్ వరుసగా ర్యాంకులు..



సచిన్

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ 1 ఫలితాల్లో సచిన్ 360 ర్యాంకు సాధించి ఎంపిడివో పోస్ట్‌కు ఎంపికయ్యాడు. అలాగే మార్చిలో వెలువడిన గ్రూప్ 2 ఫలితాల్లో 2వ ర్యాంకు, ఇటీవల రిలీజైన గ్రూప్ 3లో 23వ ర్యాంకు సాధించాడు. సిద్దిపేటకు చెందిన వడ్లకొండ సుజాత, శ్రీనివాస్ రెడ్డి చిన్న కుమారుడైన వడ్లకొండ సచిన్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఐటీ జాబ్ మానేసి సివిల్స్‌కు ప్రిపేరవుతున్నాడు.

పట్టుదలతో చదివి..



సాహితి



అఖిలారెడ్డి

జహీరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువతులు గ్రూప్-1 ఉద్యోగాలు సాధించి పట్టుదలను నిరూపించుకున్నారు. జహీరాబాద్ దత్తగిరి కాలనీకి చెందిన దన్నూరు సాహితి పట్టణంలో ఇంటర్, సంగారెడ్డిలో డిగ్రీ పూర్తి చేసి గ్రూప్-1 పరీక్షలు రాసి కార్మిక శాఖ అధికారిణిగా నియమితులయ్యారు. తల్లిదండ్రుల సహకారం, భర్త ప్రోత్సాహంతో ఈ ఉద్యోగం సాధించినట్లు సాహితి తెలిపారు. న్యాల్కల్ మండలం మిర్జాపూర్ (బి)కి చెందిన అఖిలారెడ్డి పీజీ వరకు హైదరాబాద్‌లోనే చదువుకున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న ఆమె గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికయ్యారు. తన విజయంపై ఆమెతో పాటు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

తొలి ప్రయత్నంలోనే విజయం

మెదక్ అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏదైనా సాధించాలనే తపన పట్టుదలతోపాటు తగిన విధంగా శ్రమిస్తే లక్ష్యాన్ని సాధించవచ్చని మెదక్‌కు చెందిన దొంత నిత్రిత నిరూపించింది. గ్రూప్-1 ఫలితాల్లో 502.5 మార్కులు సాధించి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైంది. మెదక్ పట్టణానికి చెందిన దొంత నరేందర్, శిరీష దంపతులకు ఏకైన కుమార్తె నిత్రిత. తండ్రి నరేందర్ నీటిపారుదల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తుండగా.. తల్లి శిరీష గృహిణి. ఢిల్లీలోని లేడీ శ్రీరామ్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఆమె సివిల్స్ లక్ష్యంగా కోచింగ్ తీసుకుని తొలి ప్రయత్నంలోనే విజయం సాధించింది.



తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద అంగన్‌వాడీల అరెస్టు

తూప్రాన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'చలో సెక్రటేరియట్' నినాదంతో హైదరాబాద్ వెళ్తున్న వివిధ జిల్లాల అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు తూప్రాన్ పట్టణం అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద పెద్ద సంఖ్యలో అరెస్టు చేశారు. అంగన్‌వాడీ అసోసియేషన్ (సీఐటీయూ) పిలుపు మేరకు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పీఎఫ్ వంటి డిమాండ్లతో వారు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసనకు బయలుదేరారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, కరీంనగర్ జిల్లాల నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో వస్తున్న అంగన్‌వాడీలను తూప్రాన్ పోలీసులు తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. తూప్రాన్ మండలానికి చెందిన ఆరుగురిని ఇళ్ల వద్దే ముందస్తుగా అరెస్టు చేశారు. టోల్‌ప్లాజా వద్ద మొత్తం 45 మంది అంగన్‌వాడీలను అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం తర్వాత వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల పరిహారం వివరాల సేకరణ

నర్సాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించే ప్రక్రియ వేగవంతంగా సాగుతున్నది. నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లోని 17 గ్రామాల గుండా ట్రిపుల్ ఆర్ వెళుతుంది. ఆర్థిక శాఖ నుంచి మొదటి విడతగా ఐదు గ్రామాలైన పాంబండ (30 మంది రైతులు), తిర్మలాపూర్ (56), చిన్నచింతకుంట (18), గుండ్లపల్లి (21), నాగులపల్లి (31) రైతులకు పరిహారం కోసం అనుమతి లభించింది. వీరికి ఆర్డీవో కార్యాలయం నుంచి ఇప్పటికే నోటీసులు అందగా, ఆ రైతులు తమ భూమి పట్టా సర్టిఫికెట్, పాన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలను ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌లో అందజేస్తున్నారు. అధికారులు బోర్లు, చెట్లు వంటి వాటి వివరాలను కూడా సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని ఆర్డీవో మహిపాల్ తెలిపారు.

శేషవాహన సేవ

గుమ్మడిదల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదలలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా శేషవాహనంపై ఊరేగారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు.

కుల నిర్మూలనే వీహెచ్‌పీ లక్ష్యం

● మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్

కంగ్టి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పాతుకుపోయిన కులవ్యవస్థ, అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించడమే విశ్వహిందూ పరిషత్ లక్ష్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కంగ్టిలోని బసవ ప్రదీప్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన 'సామాజిక సమరసత సుహాసిని మహిళా పాదపూజ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సాధు సంతులతో కలిసి 216 మంది ముత్తైదువులకు పాదపూజ చేశారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ పట్టణాల్లో అన్ని వర్గాల ప్రజలు కలిసి ఉన్నా, గ్రామాల్లో కొన్ని వర్గాలను ఇంకా వెలివేసినట్లుగా చూడటం బాధాకరమని అన్నారు. ఇలాంటి దుస్థితిని తొలగించడానికి వీహెచ్‌పీ సుహాసిని పాదపూజ వంటి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. సనాతన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడేందుకు ప్రధాని మోడీ కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం భద్రాచలం విశ్వాత్మానందగిరి స్వామి మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని రక్షించుకోకపోతే హిందువుల మనుగడ కష్టమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్, సర్వేశ్వరాంబిక శివయోగి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహమూర్తి, ఉపాధ్యక్షులు జగదీశ్వర్, ధనుంజయ, ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమరెడ్డి, అనుసూయరెడ్డి, టీజీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, రాష్ట్ర నాయకులు రవిగౌడ్, శంకర్, రాంరెడ్డి, గీతారెడ్డి, మనోహర్, అంజనేయులు, సత్యనారాయణ, దత్తాత్రి, గంగారాం, సాయిరాం, నరేందర్, రజనీకాంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు పాదపూజ చేస్తున్న స్వామీజీలు ఈటేల రాజేందర్

ఐఐటీహెచ్‌లో భవిష్యత్ తరం చిప్‌ల డిజైన్

● 75కుపైగా సెమీకండక్టర్ డిజైన్ల అభివృద్ధి
● మొబైల్ నావిగేషన్, డ్రోన్లు, రక్షణ వ్యవస్థల.. సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా రూపకల్పన
● ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకుల ఘనత

కంది, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మొబైల్ నావిగేషన్, డ్రోన్లు, రక్షణ వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచగలిగే అత్యాధునిక చిప్‌లను ఐఐటీ హైదరాబాద్ అభివృద్ధి చేసింది. అత్యంత ఆధునికమైన సుమారు 75 సెమీకండక్టర్ చిప్ డిజైన్లను ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు కలిసి రూపొందించారు. చాలా వరకు విదేశాలకే పరిమితమైన సెమీకండక్టర్ చిప్ డిజైనింగ్‌ను ఐఐటీహెచ్‌లో విజయవంతంగా నిర్వహించడం హర్షనీయమని శాస్త్రవేత్తలు ప్రశంసిస్తున్నారు. దీనికి సంబంధించి గురువారం ఐఐటీహెచ్ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. అధునాతన ఇమేజ్ సెన్సర్ల నుంచి తదుపరి తరం చిప్‌ల వరకు అభివృద్ధి చేస్తూ.. సెమీకండక్టర్ పరిశోధన, శిక్షణ కేంద్రంగా ఐఐటీహెచ్ నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ చిప్‌లు స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఎలక్ట్రిక్ కార్లు, అధునాతన వైద్య పరికరాల్లో వినియోగించేందుకు వీలుగా అభివృద్ధి చేశారని.. కృత్రిమ మేధస్సు, కంప్యూటింగ్, కమ్యూనికేషన్ వంటి రంగాల్లో పురోగతికి మార్గం వేస్తాయని తెలిపారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఐఐటీహెచ్ ముందంజలో ఉందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. వినూత్న టెక్నాలజీ ఉపయోగించి, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా ఉండే పరిశోధనలు జరుపుతున్నామని వివరించారు. ఐఐటీహెచ్ పరిశోధకులు ప్రపంచ స్థాయికి పరిశోధనలను విస్తరించడం గర్వకారణమని పేర్కొన్నారు.



ఐఐటీహెచ్ పరిశోధకులు అభివృద్ధి చేసిన చిప్‌లు

కాంగ్రెస్ గుణపాఠం తప్పదు : పీడీఎస్‌యూ

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, నాగరాజు హెచ్చరించారు. సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు పూర్తయినా విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో విఫలమైందని విమర్శించారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజు నియంత్రణ చట్టం అమలు చేస్తామని చెప్పినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షలా మారిందని అన్నారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మధు, జగన్నాథరావు, శ్రీకాంత్, నవీన్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు గౌతమ్ కుమార్, మస్తాన్, అజయ్, ప్రణయ్, శ్రీనివాస్, ప్రదీప్, శ్యామ్, దీపాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రక్తదానం దాతలకూ మేలు చేస్తుంది'



మాట్లాడుతున్న వినయ్ కుమార్ గుప్తా

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల దాతల్లో రక్తపోటు తగ్గుతుందని, కొత్త రక్తం ఉత్పత్తి అయి చురుకుగా ఉంటారని కేంద్ర ఔషధ నియంత్రణ మండలి అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ వినయ్ కుమార్ గుప్తా అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో జరిగిన ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాల ముగింపు సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలాంటి పెద్ద దేశంలో కూడా ప్లాస్మాను దిగుమతి చేసుకోవడం విచారకరమని, సగం మంది ప్రజలు రక్తదానం చేసినా మనం రక్తాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఔషధాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. గీతం ఫార్మసీ అధ్యాపకుల కృషిని ఆయన అభినందిస్తూ, అది అగ్రస్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఐసీటీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ టి.కుమారగురు, యశోద ఆసుపత్రి క్లినికల్ ఫార్మసిస్ట్ డాక్టర్ రేష్మా అజయ్ పాల్గొని విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు. తొలుత స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్ అతిథులను స్వాగతించి, సత్కరించారు. ఈ వేడుకలను డాక్టర్ సతీష్, డాక్టర్ పూజా మిట్టల్, ఇతర అధ్యాపకులు సమన్వయం చేశారు. వివిధ రకాలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'గీతం' విద్యార్థుల క్రీడా ప్రతిభ

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గీతం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి స్మారక అంతర్ ప్రాంగణ క్రీడా పోటీల్లో హైదరాబాద్ ప్రాంగణం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నం, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంగణాల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో గీతం హైదరాబాద్ జట్లు అథ్లెటిక్స్, టీం గేమ్‌లలో పతకాలు సాధించాయి. అథ్లెటిక్స్‌లో 100, 200, 1500 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ తదితర పోటీల్లో పతకాలు గెలుచుకున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్‌లో పురుషుల జట్లు, వాలీబాల్‌లో మహిళల జట్టు రజత పతకాలు సాధించాయి. కబడ్డీలో పురుషుల జట్టుకు స్వర్ణం, మహిళల జట్టుకు రజతం లభించింది. బ్యాడ్మింటన్, పికిల్‌బాల్‌లలో మహిళలు స్వర్ణం గెలుచుకోగా, పురుషులు రజతం సాధించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 33 మంది విద్యార్థులు సౌత్ జోన్ పోటీల్లో గీతం విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికయ్యారు.



గీతం అధ్యాపకులతో క్రీడాకారులు


జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న శారద



అవార్డు అందుకుంటున్న శారద

గుమ్మడిదల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వాకిట శారద 'నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్' అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని బిర్లా ప్లానెటోరియం భాస్కర ఆడిటోరియంలో శారద ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. మూడు రాష్ట్రాల నుంచి ఎంపికైన 170 మందికి టీచర్లకు అందజేశారు. విద్యారంగానికి అంకితభావంతో సేవలు అందించినందుకు శారదకు ఈ గౌరవం లభించింది. ప్రముఖ హాస్యనటుడు రఘు చేతుల మీదుగా ఆమె 2025 సంవత్సరానికి ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ గౌరవం తనకే కాకుండా విద్యారంగానికి కృషి చేస్తున్న ప్రతి ఉపాధ్యాయునికి దక్కుతుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే నిజమైన బహుమతి అని ఆమె పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ కుమారుడికి ఎంబీబీఎస్ సీటు



ఉబేద్

జహీరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఒక ఆటో డ్రైవర్ కుమారుడు ఎంబీబీఎస్ సీటు సాధించాడు. జహీరాబాద్ మండలం, హోతి (బి) గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఇబ్రహీం కుమారుడు ఉబేద్, అల్గోల్ మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివాడు. తండ్రి కష్టాన్ని గుర్తించి కష్టపడి చదివి నీట్‌లో మంచి ర్యాంకు సాధించి, నాగర్‌కర్నూల్ వైద్య కళాశాలలో సీటు సంపాదించాడు. ఇదే పాఠశాల నుంచి మరో ఇద్దరు విద్యార్థులు గౌతమ్‌కన్నా (నిర్మల్ మెడికల్ కాలేజీ), సృజన్‌కుమార్ (ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీ) కూడా ఎంబీబీఎస్ సీట్లు సాధించినట్లు అధ్యాపకులు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడిపై ఫోక్సో కేసు..

● పార్టీ నుంచి సస్పెండ్

కుకునూరుపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): లకుడారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కంకణాల మల్లేశాన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు గ్రామ శాఖ అధ్యక్షుడు మంజే స్వామి తెలిపారు. ఈ సందర్భంగా మంజ స్వామి మాట్లాడుతూ కంకణాల మల్లేశం గ్రామంలోనే కాకుండా ఇతర గ్రామాలలో కూడా వివిధ భూ వివాదాల్లో తలదూర్చి వివాదాలకు కారణం అవుతున్నాడు. అంతేకాకుండా రెండు రోజుల క్రితం అతడిపై పోక్సో కేసు కూడా నమోదయిందని దీంతో పార్టీ అధిష్ఠానం మల్లేశాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు అందాయని ఆయన తెలిపారు. పార్టీని, పార్టీ పేరును వాడుకొని భూ దందాలు, మరే ఇతర వివాదాలలో కలగజేసుకొని పార్టీకి చెడ్డ పేరు తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● మిరుదొడ్డి వైద్యాధికారి సమీనాసుల్తానా

మిరుదొడ్డి, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిరుదొడ్డి వైద్యాధికారి సమీనాసుల్తానా అన్నారు. గురువారం మిరుదొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారిసశక్త్ అభియాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని స్వస్థనారి సశక్తి అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షనీయమని తెలిపారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య శిబిరాన్ని మహిళలు, గర్భిణులు, కిశోరబాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో లింగమూర్తి, వైద్యసిబ్బంది తదితరులున్నారు.

సీఎం సలహాదారుడిని కలసిన టీపీసీసీ మెంబర్


నరెందర్ రెడ్డిని కలసిన టీపీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం

సిద్దిపేట, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): సీఎం వ్యవహారాల ప్రధాన సలహాదారుడు వేం నరెందర్ రెడ్డిని టీపీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం హైదరబాద్ లో గురువారం రోజున మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దరిపల్లి చంద్రం మాట్లాడుతూ పార్టీ కోసం కష్ట కాలంలో కష్ట పడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కు పూర్తి మద్దతుగా అధిష్ఠానం ఉంటుందని వేం నరేందర్ రెడ్డి భరోసా ఇచ్చారని తెలిపారు.

సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి

కోహెడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న జయపాల్‌పై చర్యలు తీసుకోవాలని కూరెల్ల గ్రామంలోని ఇళ్ల నిర్మాణ యజమానులు తాహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్ కు గురువారం ఫిర్యాదు చేశారు. మండలంలోని కూరెళ్ల గ్రామంలోని ఒకటో సర్వే నెంబర్‌లో నాలుగుతరాలు నుంచి 12 మందికి పైగా కుటుంబాలు నివాసంగా ఉన్నాయన్నారు. ఉన్న స్థలాల్లో వ్యవసాయ భూమి అంటూ సర్వేయర్ వచ్చి కొలతలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తాత, ముత్తాతల సమయాల్లోనే ఇండ్ల నిర్మాణంతో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇంటి, నల్ల పన్నులు చెల్లించడం జరుగుతుందన్నారు. ఇళ్లు ఉన్న భూమిని పాస్ బుక్కు నుంచి తొలగించాల్సింది పోయి సర్వే చేయడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం కంఠంగా ఈ భూమిని మార్చాల్సింది పోయి పట్టా చేసుకున్న ఆకుల ఎల్లయ్య అనే రైతుకు మద్దతుగా రావడంతో సర్వేయర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మం వేంకటేశం, గాజుల రవీందర్, బండారు ఐలయ్య, కనకయ్య, వెంకన్న, కనకయ్య, పెద్ద బాలయ్య, కొమురయ్య, మల్లయ్య, లింగయ్య, శ్రీశైలం, చేపూరి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.









చిమ్మచీకట్లో ఆర్టీసీ బస్టాండ్

● ప్రయాణికుల ఇబ్బందులు


చీకటిమయంగా ఆర్టీసీ బస్టాండు ఆవరణ

చేర్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో చీకట్లు అలముకున్నాయి. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యమో, విద్యుత్ సిబ్బంది పట్టింపులేనితనమో గాని రెండు రోజులుగా విద్యుత్‌దీపాలు వెలగకపోవడంతో సాయంత్రంతో పాటు, తెల్లవారు జామున కూడా ప్రయాణికులు నానాతంటాలుపడుతున్నా చోద్యం చూస్తున్నారు. పలువురు ప్రయాణికులను బస్సు ఎక్కించేందుకు రాత్రి, తెల్లవారుజామువేళల్లో ఆర్టీసీబస్టాండు చేరుకోగా, చీకటిమయంగా ఉండటంతో బస్సు వచ్చేంత వరకు తమ వాహనాల లైట్ ఆన్‌చేస్తున్నారు. రోజులు గడుస్తున్నా చిన్నపాటి పనిని సరిచేయకపోవడం పట్ల సంబంధిత అధికారుల తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా నిద్రమత్తువీడి మరమ్మతులు చేపట్టి విద్యుత్ వెలుగులు పునరుద్ధరింపచేయాలని కోరుతున్నారు.

శాకాంబరిగా దుర్గమ్మ


చేర్యాల పట్టణంలో శాకాంబరి అలంకరణలో దుర్గమ్మ

చేర్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని గురువారం చేర్యాల పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంతో పాటు వాసవీనగర్ కాలనీలో దేవీవాసవి పడుతి సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవిని శాకాంబరీగా కొలిచారు. ఈసందర్భంగా అమ్మవారిని కూరగాయలతో అలంకరించి విశేషపూజలు నిర్వహించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

జీఎస్టీ పేరుతో సంబరాలా..?

● జీఎస్టీ తెచ్చిందే బీజేపీ.. తగ్గించింది ఆ పార్టీనే

● మతం పేరుతో, రాముడి పేరుతో బీజేపీ రాజకీయాలు

గజ్వేల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జీఎస్టీని తీసుకవచ్చి పేద ప్రజల నడ్డి విరిపించే భారతీయ జనతా పార్టీ అని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నరేంద్రమోదీ సర్కారు ఏర్పడి 12యేళ్ల దాటుతున్నా ఇప్పటివరకు యూరియాను దిగుమతి చేసుకుంటున్నామని, మేక్ ఇండియా పేరుతో చేపట్టిన కార్యక్రమం ఏమైందని ప్రశ్నించారు. జీఎస్టీ పన్ను విధానాన్ని తీసుకువచ్చి... నాలుగు స్లాబులు పెట్టి పేద ప్రజల నడ్డి విరిచిందే బీజేపీ అని, 2017 నుంచి ఇప్పటివరకు పేద ప్రజల నుంచి జీఎస్టీ రూపంలో వసూలు చేసి ఇప్పుడు తగ్గించామని గొప్పలు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. పేదరిక నిర్మూళన చేయాల్సిన మోదీ ప్రభుత్వం పేదవారి వద్దనే 28శాతం చొప్పున జీఎస్టీ పేరిట వసూళ్లకు పాల్పడిందని మండిపడ్డారు. ఆయనవెంట మునిసిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, పట్టణ బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు ఉప్పల మెట్టయ్య, బబ్బూరి రజిత, మంజులారెడ్డి, మన్నె రాములు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విశ్వశాంతి విద్యార్థుల ఎంపిక

వర్గల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వర్గల్ మండలం నెంటూర్ విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు గురువారం పాఠశాల కరస్పాండెంట్ దేవి దయాకర్ తెలిపారు. ఇటీవల ఎర్రవల్లిలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో తమ పాఠశాల నుంచి మేఘన, వినయ్, అభిలాష్‌లు చక్కటి ప్రతిభను కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనందుకుగాను వారిని, పాఠశాల పీఈటీ శ్రీకాంత్‌ను అభినందించారు. ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి 35వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో వీరు జిల్లా జట్టు నుంచి పాల్గొంటున్నట్లు వివరించారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

చిన్నకోడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) :పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సిద్దిపేట ఏడీఏ పద్మ సూచించారు. మండలంలోని అనంతసాగర్ గ్రామంలో రైతులు సాగు చేసిన వరి, పత్తి పంటలనుగురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వరి, పత్తి పంటలకు సోకే తెగుళ్ల, వాటి నివారణ చర్యలను గురించి రైతులకు వివరించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రైతులు పంటల సాగు వివరాలను ఏఈవోల వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో జయంత్ కుమార్, ఏఈవో శిరీష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు


ఛలో సెక్రటేరియట్‌లో పాల్గొన్న జిల్లా అంగన్‌వాడీ టీచర్స్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్ల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో చేసి గురువారం ఛలో సెక్రటేరియట్ చేపట్టారు. జిల్లావ్యాప్తంగా సిద్దిపేట, చేర్యాల, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక మొత్తంగా ఐదు ప్రాజెక్టులలో సుమారు రెండువేల పైచిలుకు అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ ఉండగా ముట్టడిలో సుమారు 600 మంది పాల్గొన్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.. ఛలో సెక్రటేరియట్ కార్యక్రమంలో భాగంగా గురువారం తెల్లవారుజామునుండే జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలు గ్రామాల పరిధిలో అనుబంధ సంఘ అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ సభ్యులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. గతంలో సీఐటీయూ అనుబంధంగా పనిచేసిన టీచర్స్, హెల్పర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 300 మందిని ముందస్తు అరెస్టు చేసినట్లు సమాచారం.

రైతుల్లో గుబులు

(5వ పేజీ తరువాయి)

భారీగానే దెబ్బతిన్నది. నల్లరేగడిలో పత్తి పంట దాదాపుగా ఎర్రబడి కుళ్లిపోగా, ఎర్రచెల్క నేలల్లో సైతం గతంలో ఎన్నడూ లేనివిధంగా పంట ఎర్రబారింది. దీంతో పత్తి రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. మొక్కజొన్న పంట పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. పొలాల్లోనే ఉన్న మొక్కజొన్న కంకులకు మొలకలు రావడం, కొన్ని కంకులు నల్లబడటం రైతులకు మరింత నష్టాన్ని కలిగిస్తోంది. కత్తెర పురుగు కారణంగా ఈసారి సాగు తగ్గించినా, ప్రస్తుత వర్షాలతో మరింత నష్టపోతున్నారు. దీంతో వరి మినహా పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేసిన రైతాంగానికి దిగుబడిపై ఆశలు సన్నగిల్లాయి.


చిరుజల్లులు కురుస్తుండటంతో గొడుగు సహాయంతో వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారస్తులు

వదలని వాన.. కమ్మేసిన ముసురు

సిద్దిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను వర్షాలు వదలడం లేదు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గురువారం పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. తెల్లవారుజాము నుంచే జిల్లాలోని పలు ప్రాంతాల్లో మేఘాలు పూర్తిగా కమ్ముకోగా, అక్కడక్కడా ముసురు కమ్మేసింది. హుస్నాబాద్‌లో గరిష్ఠంగా 26.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. గురువారం కురిసిన చిరుజల్లుల వల్ల పలు రహదారులు చిత్తడిగా మారాయి. వాహనదారులకు, చిరువ్యాపారులకు ఇబ్బందులు తప్పలేవు. అసలే పండుగ సీజన్ కావడంతో పలువురు చిరు వ్యాపారులు గొడుగు సహాయంతో వ్యాపారం కొనసాగించారు. కాగా, నేడు మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అక్కడక్కడా అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు సూచించారు.

పలు మండలాల్లో వర్షపాతం

హుస్నాబాద్ మండలంలో అత్యధికంగా 26.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, అక్కన్నపేటలో 24.3, కోహెడ 19.8, నంగునూరు 18.8, ధూలిమిట్ట 16.0, బెజ్జంకి 14.8, నారాయణరావుపేట 10.8, సిద్దిపేట అర్బన్ మండలంలో 9.8 మి.మీ.లు నమోదైంది.

ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం


హుస్నాబాద్‌లో ప్రపంచ ఫార్మసిస్ట్ వేడుకలు

హుస్నాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఫార్మసిస్టు సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు బింగి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి దాసరి వినోద్, శ్రీనివాస్, కొంకట నళిని రవీందర్, రావుల రంజిత్, కూకట్ల భరద్వజ్, వేముల సంధ్య, శృతి, బింగి వెంకటరమణ, పడాల రామక్రిష్ణ, చిప్ప తిరుపతి తదితరులున్నారు.

స్టీల్ బ్యాంకు పంపిణీ చేసిన మంత్రి సతీమణి


స్టీల్ బ్యాంకును పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల

హుస్నాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని మహిళా సంఘాలకు గురువారం సాయంత్రం పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అందిస్తున్న స్టీల్ బ్యాంకును రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల పంపిణీ చేశారు. పట్టణంలోని 20 వార్డులుండగా ప్రతి వార్డుకు చెందిన మహిళా సంఘాలకు 17 రకాల స్టీల్ పాత్రలు కలిగిన ఒక స్టీల్ బ్యాంకును పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌ను వినియోగించవద్దనే ఉద్దేశంతో ఈ స్టీల్ పాత్రలను అందిస్తున్నామని, ప్రతి ఒక్కరు వీటిని వినియోగించుకోవాలని కోరారు. అలాగే పలుచోట్ల మహిళలతో కలసి బతుకమ్మ ఆడారు.

బతుకమ్మ వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను గురువారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా హైదరాబాదులోని ఎమ్మెల్యే కార్వర్టర్స్‌లో పర్వతాలుయాదవ్ తదితరులు పల్లాను కలిసి స్థానిక సమస్యలతో పాటు బతుకమ్మ విశేషాలను చర్చించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

జగదేవ్ పూర్ , సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జగదేవ్ పూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తెలిపారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మన సంస్కృతి సంప్రదాయాలను అందించే గొప్ప పండుగ బతుకమ్మ అని ఇందూర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.పి.రాజు అన్నారు. గురువారం కళాశాల పరిధిలో ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీరక్క పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకొచ్చి సంప్రదాయ దుస్తులతో ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పువ్వులను బతుకమ్మలా పేర్చి పువ్వులను పూజించే సంప్రదాయం మన దేశంలో మన తెలంగాణ తప్ప ఎక్కడ లేదని అన్నారు. బతుకమ్మ పండుగ సంస్కృతి సంస్కృతి విషయాలన్నీ పిల్లలకు తెలియజేస్తూ తమ కళాశాల యందు బతుకమ్మ సంబరాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

సమాజ సేవలో ముందుండాలి

మద్దూరు/దౌల్తాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజిక సేవలో ముందుండాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్, మంగ్య నాయక్, సంపత్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ మాంగ్య నాయక్, సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలింటర్లు గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో నాలుగవ రోజు పిచ్చి మొక్కలను చెత్తాచెదారాన్ని తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ప్రత్యేక శీతాకాల శిబిరాలతో విద్యార్థులలో సేవా దృక్పథం అలవడుతుందని మద్దూరు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దౌల్తాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన అక్కమొల్ల కనకయ్య ఇటీవల గుండెపోటుకు గురై వర్గల్ మండలం లక్ష్మక్కపల్లి ఆర్ వీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం దౌల్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షులు నర్రా రాజేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడవద్దని బాధిత కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా కల్పించారు.



ఎండిట్ దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ రఘునందన్ రావు

ఘనంగా పండిట్ దీన్‌దయాల్ జయంతి

సిద్దిపేట క్రైం,/గజ్వేల్/చేర్యాల సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాల్ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీ రఘునందన్ రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. దీనదయాల్ అంత్యోదయ ఆశయసాధనకు కృషి చేయనున్నట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ తెలిపారు.

పల్లెల్లో బతుకమ్మ కళ తప్పింది

సిద్దిపేట క్రైం సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో బతుకమ్మ కళ తప్పిందని, గ్రామాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని బీఆర్ఎస్ నాయకులు సోమిరెడ్డి, ఎల్లారెడ్డి పాపయ్య అన్నారు. గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు.గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉందని,బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్లు లేవన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

అక్కన్నపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలం బొడిగపల్లి స్టేజి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్లకు ఆనుకొని ప్రమాదకరంగా ఉండడంతో గురువారం స్థానికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల గోడకు ఆనుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణగా కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి రక్షణగా ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని వారు కోరారు.


సిద్దిపేట 36వవార్డులో బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ సంబరం

సిద్దిపేట కల్చరల్, కొండపాక/సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) :సిద్దిపేట పట్టణంలో బతుకమ్మ పండుగ సంబరాలు ఆడపడుచులు ఆనందోత్సవాల మధ్య చేసుకుంటున్నారు. గురువారం 5వ రోజున పట్టణంలోని 36వ వార్డులో జరిగిన బతుకమ్మ సంబరాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు పాల్గొన్నారు. పర్యావరణాన్ని కాపాడాలని వినూత్న రీతిలో బతుకమ్మలను అందంగా పేర్చారు. వర్షం పడుతున్న కూడా మహిళలు బతుకమ్మలు ఆడి పాడారు. అలాగే పట్టణంలోని టెలికాంనగర్‌లో బతుకమ్మ సంబరాలు కొనసాగాయి. మహిళలు ఏకరూప దుస్తుల్లో బతుకమ్మ సంబరాలు చేసుకున్నారు. అలాగే కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు అధ్యాపకులు బతుకమ్మ సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు.